నాయకుల ప్రత్యేక దృష్టి

మద్యం అమ్మకాలను ప్రభుత్వం కఠినతరం చేయడంతో రాజకీయ నాయకులు సారా వైపు దృష్టి సారించారు. పలు గ్రామాలకు సారా పంపకాల కోసం ముందస్తు అడ్వాన్సులు చెల్లించి తమ గ్రామాలకు నేరుగా సారా అందేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. గత ఎన్నికల సమయంలో కొండలోగాం పంచాయతీ రామరాయి సమీపంలో జిల్లాలోనే అతి పెద్ద సారా తయారీ కేంద్రాన్ని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎన్నికల దృష్ట్యా ఒకే కేంద్రంగా కాకుండా పదుల సంఖ్యలో కేంద్రాలు నెలకొల్పి పెద్ద ఎత్తున తయారీ చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల వేళ.. మొత్తం విక్రయాలు రూ.కోట్లలో ఉంటుందని పలువురి అంచనా.



- సరిహద్దులో గుప్పుమంటున్న సారా
- ఒడిశాలో తయారీ.. ఆంధ్రాలో విక్రయాలు
- ఎన్నికలే లక్ష్యంగా.. రవాణా
- చోద్యం చూస్తున్న అధికారులు

సారా మామూలే!

(హరిపురం/మెళియాపుట్టి)

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాల్లో సారా మరింత గుప్పుమంటోంది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని కొండల్లో సారా తయారు చేసి రాత్రి వేళ జిల్లాకు రవాణా చేసి విక్రయిస్తున్నారు. మందస, సోంపేట, పలాస, మెళియాపుట్టి తదితర మండలాల్లో సారా ఏరులై పారుతోంది. కొందరు రాజకీయ నాయకుల అండదండలు, అధికారుల నిర్లక్ష్యం, ఎక్సైజ్ అధికారుల చేతివాటం వెరసి సారా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలు.. సారా తయారీ కేంద్రాలుగా వెలుస్తున్నాయి. మెళియాపుట్టి మండలం సరిహద్దులోని భరణికోట, బాణాపురం పంచాయతీ సమీపంలో ఒడిశాకు చెందిన దుర్గాకొండలో అధికంగా సారా తయారీ అవుతోంది. అలాగే మందస మండలం కొండలోగాం, సవరమధ్య, చీపి, కురడాలు, బుడార్సింగి, బుడంబో, సాభకోట, సింగుపురం, చినకోష్టతో పాటు బాతుపురం, కృష్ణాపురం తీరప్రాంతమైన ఏడూళ్లపాలెం, పెంటిపద్ర, లొత్తూరు, రెంటికోట, గొప్పిలితోపాటు పలు గ్రామాల సరిహద్దుల్లో సారా తయారీ చేసి.. ఇతర ప్రాంతాలకు పట్టపగలే రవాణా చేస్తున్నారు. మత్స్యకార, ఉద్దాన గ్రామాలకు ఒడిశా నుంచి సముద్ర మార్గం గుండా తెప్పల ద్వారా సారా రవాణా చేపడుతున్నారు. గుడ్డిమీద బహాడపల్లి, సవర మధ్య, సవర బాణాపురం, సరియాపల్లి తదితర గ్రామాల్లో రాత్రి, పగలూ అమ్మకాలు చేపడతున్నారు. సారాలో రంగు, చీప్‌లిక్కర్ కలిపే యంత్రాలను సైతం ఏర్పాటు చేశారనే ఆరోపణలున్నాయి. ఈ విషయం అధికారులకు తెలిసినా మామూళ్ల మత్తులో పట్టించుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు.



మందస-ఒడిశా సరిహద్దులో సారా తయారీ డంప్



ఒడిశా సరిహద్దులో సారా కోసం సిద్ధం చేసిన బెల్లం ఊటలు

తీవ్ర ప్రభావం

సారాలో అధిక మత్తు కోసం బ్యాటరీ పొడి, చెప్పులు, యూరియా, చెట్ల బెరడులు, బెల్లం, కొన్నిరకాల మందులతోపాటు కొన్ని రకాల స్టెరాయిడ్స్ కలుపుతున్నారు. దీన్ని సేవించిన వారికి సారాలో ఉండే మిథైన్ ఆల్కాహాల్ వల్ల అధికంగా మత్తు కలిగి గుండె, మూత్రపిండాలు, జీర్ణకోశ, కళ్లు, మెదడు సంబంధ వ్యాధులకు గురవుతున్నారని పలువురు వైద్యులు సైతం హెచ్చరిస్తున్నారు.

రవాణాలోనూ నూతన పద్ధతులు

ఎక్సైజ్, పోలీసు అధికారుల కళ్లుగప్పి పట్టపగలే ఆటోలు, స్కూటర్లు, మారుతీ వ్యాన్లలో సారా తరలిస్తున్నారు. రాత్రి సమయంలో గిరిజనులే వారధులుగా కావిడి మోస్తూ మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. కావిడి సురక్షితంగా తరలించిన వారికి రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు ఇస్తున్నారు. 20 లీటర్లు సారాను రూ.3వేలకు కొనుగోలు చేసి మరో 20 లీటర్ల నీటిని కలిపి సుమారు రూ.12వేలకు అమ్ముతూ వ్యాపారులు రూ.లక్షల్లో లాభం పొందుతున్నారు. గ్రామాభివృద్ధి పేరుతో ఉద్దానంలో గ్రామ పెద్దలే సారా అమ్మేందుకు అనధికారికంగా వేలం పాటలు నిర్వహిస్తుండడం కొసమెరుపు.



మెళియాపుట్టి సమీపంలో సారా తయారీ కేంద్రాన్ని ధ్వంసం చేసిన పోలీసులు, ఎస్ఈబీ అధికారులు(ఫైల్)

దాడులు చేస్తున్నా అంతే..

గిరిజన గ్రామాల్లో సారా లేకుండా చేయాలనే లక్ష్యంతో ఎస్పీ రాధిక.. గిరిజనుల్లో మార్పు తీసుకువచ్చేందుకు 'పరివర్తన' పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలీసులతో పాటు ఎస్ఈబీ, టాస్క్‌ఫోర్స్ బృందాలు కూడా సారా తయారీ కేంద్రాలపై దాడులు చేసి బెల్లం ఊటలు ధ్వంసం చేస్తున్నాయి. ఇటీవల మెళియాపుట్టి మండలం సరిహద్దులో ఒడిశా పోలీసుల సహకారంలో ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి సుమారు 30వేల లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేశారు. కాగా.. తయారీదారులు మాత్రం పోలీసులకు పట్టుబడడం లేదు. ఈ క్రమంలో దాడులు చేస్తున్నా.. మళ్లీ యథావిధిగా సారా తయారీ, విక్రయాలు సాగుతున్నాయి. ఎన్నికల వేళ సారా నిర్మూలన ఎస్ఈబీ అధికారులకు, పోలీసులకు సవాల్‌గా మారింది.

దాడులు చేస్తున్నాం

సారా తయారీపై స్థానిక పోలీసులతో కలసి ముమ్మరంగా దాడులు చేస్తున్నాం. తయారీ సామగ్రినీ, బెల్లం ఊటలను ధ్వంసం చేశాం. పదుల సంఖ్యలో డంప్‌లు స్వాధీనం చేసుకుని నియంత్రించాం. ఒడిశా ప్రాంతంలో తయారీ జరిగి రవాణా చేస్తున్న సమయంలో పట్టుకుంటున్నాం. ఇప్పటికే 12మందిపై కేసులు నమోదు చేశాం. సారా తయారు చేసినా.. విక్రయించినా.. రవాణా చేసినా కఠినచర్యలు తప్పవు.

\- జైభీం, ఎక్సైజ్ సీఐ, సోంపేట

ప్రజా సహకారం అవసరం

జిల్లాలో సారా నిర్మూలనకు ప్రజల సహకారం ఉండాలి. ఎక్కడైనా సారా తయారీ చేసినట్టు తెలిస్తే సమాచారం ఇవ్వాలి. ప్రస్తుతం ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో సారా బట్టీలను ధ్వంసం చేస్తున్నాం. ఎన్నికల వేళ.. ఎక్కడైనా సారాతో దొరికితే కచ్చితంగా శిక్ష పడుతుంది.

\- రామచంద్రకుమార్, ఎస్ఈబీ సీఐ, టాస్క్‌ఫోర్స్, పలాస డివిజన్



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

ఇంటింటా ప్రచారాలకు ముందస్తు అనుమతి అవసరం లేదు

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

అరసవల్లి, ఏప్రిల్ 10: 'ఇంటింటా ప్రచారానికి ముందస్తు అనుమతి అవసరం లేదు. స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించి ఆయా రాజకీయ పార్టీలు ఇంటింటా ప్రచారం నిర్దిష్ట వేళల్లో ఎప్పుడైనా చేపట్టవచ్చ'ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో 41వ వారపు సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎలాంటి సమస్యలున్నా తెలియజేయాలి. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఇప్పటివరకు 972 ఫిర్యాదులు రాగా వాటిని క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకున్నాం. ఈ నెల 18 నుంచి 25వరకు నామినేషన్ల ప్రక్రియ ఉంటుంది. 26న నామినేషన్ల పరిశీలన. 29 వరకు ఉపసంహరణకు గడువు. రాజకీయ పార్టీలు అనుమతుల కోసం సువిధ, ఎన్‌కోర్ యాప్‌ల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాం. ఎన్నికలు ప్రశాంతంగా.. సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం అవసరమ'ని తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పీఎంజే బాబు(టీడీపీ), రౌతు శంకరరావు(వైసీపీ), సురేష్‌సింగ్ బాబు(బీజేపీ), లావ సోమేశ్వరరావు (బీఎస్పీ), మల్లిబాబు (కాంగ్రెస్), రట్టి ప్రకాశరావు(సీపీఎం), ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



పట్టుబడిన నగదును లెక్కిస్తున్న ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు

రూ.7.30లక్షల స్వాధీనం

- తనిఖీల్లో పట్టుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్

నరసన్నపేట, ఏప్రిల్ 10: నరసన్నపేట నియోజకవర్గంలో బుధవారం డీటీ గాయిత్రి ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలు తనిఖీ చేయగా.. రూ.7.30లక్షలు పట్టుబడ్డాయి. మడపాం టోల్‌ప్లాజా వద్ద ద్విచక్ర వాహనదారుడు లంక శ్రీనివాసరావు వద్ద రూ.1,03,000 స్వాధీనం చేసుకున్నారు. జమ్ము జంక్షన్ వద్ద కొమర నీలాద్రిరావు కారులో రూ.4 లక్షలు, పోలాకి రోడ్డులో ఓ వ్యక్తి వద్ద రూ.2.30లక్షలు గుర్తించారు. పత్రాలు లేకుండా ఈ నగదు తరలిస్తుండడంతో స్వాధీనం చేసుకున్నామని డీటీ గాయిత్రి తెలిపారు. ఆర్వో జీవీఎస్ రామ్మోహన్‌రావు ఆదేశాల మేరకు ఉపఖజానా కార్యాలయంలో డిపాజిట్ చేశామన్నారు.

రాజీనామా చేయాల్సిందే

- వలంటీర్లపై వైసీపీ నేతల బలవంతపు ఒత్తిడి


ఇచ్ఛాపురం, ఏప్రిల్ 10: ఇచ్ఛాపురం మునిసిపాల్టీ పరిధిలో 50మంది వార్డు వలంటీర్లు బలవంతంగా రాజీనామా చేశారు. ఎన్నికల్లో వలంటీర్ల సేవలను ఎలాగైనా తమ పార్టీకి అనుకూలంగా వినియోగించుకోవాలని వైసీపీ నాయకులు భావించారు. కాగా.. ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనరాదని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల వేళ రాజీనామా చేయాలంటూ వైసీపీ నాయకులు వలంటీర్లపై ఒత్తిడి చేస్తున్నారు. ప్రచారంలో పాల్గొనాలని సూచిస్తున్నారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే మీ ఉద్యోగాలకు మాదీ గ్యారంటీ అంటూ భరోసా ఇస్తున్నారు. ఈక్రమంలో కొంతమంది వలంటీర్లకు ఇష్టం లేకున్నా వారితో బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారు. ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పరిధిలో 181 మంది వలంటీర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఈ నెల 8న 24 మంది, బుధవారం 26 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌కు అందజేశారు. కాగా.. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కో వలంటీర్‌కు రూ.10 వేలు వేతనం చొప్పున అందజేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు రాజీనామా చేస్తే ఎన్నికల తర్వాత తమను మళ్లీ వలంటీర్లుగా తీసుకుంటారో.. లేదోనని చాలామంది సందేహం వ్యక్తం చేస్తున్నారు.

అక్కడ ఉండడం కష్టమే!

- హుద్‌హుద్ కాలనీలో కానరాని మౌలిక సదుపాయాలు
- విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు
- 92 మందికి మాత్రమే ఇళ్ల కేటాయింపు

(టెక్కలి)

హుద్‌హుద్ ఇళ్ల కాలనీలో నివసించడం కష్టమేనంటూ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ హయాంలో ఈ ఇళ్లు నిర్మించగా.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యానికి గురయ్యాయి. లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులో జాప్యం కావడంతో నిరుపయోగంగా మారాయి. ఇటీవల అధికారపార్టీ నేతలు కొంత మంది లబ్ధిదారులకు ఇళ్ల కేటాయించారు. కాగా.. విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. టెక్కలి మేజర్ పంచాయతీ గోపినాథపురం సమీపంలోని కంకరబందలో టీడీపీ హయాంలో రూ.8.54 కోట్లతో ఆరు బ్లాకుల్లో 192 హుద్‌హుద్ ఇళ్లు నిర్మించారు. హుద్‌హుద్ తుఫాన్‌లో నిరాశ్రయులైన వారికి, టెక్కలిలో రోడ్ల విస్తరణలో పూర్తిగా నష్టపోయినవారికి ఈ ఇళ్లు కేటాయించాలని అప్పట్లో టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. మౌలిక సదుపాయాల కోసం మొదటివిడత రూ.7.16 కోట్లు, రెండో విడత రూ.1.35 కోట్లు అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిధులు కేటాయించారు. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నిర్మాణ పనులు పూర్తిచేశారు. కాగా.. సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో ఇళ్ల కాలనీ పంపిణీ ప్రక్రియ అర్థాంతరంగా నిలిచిపోయింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగేళ్లపాటు ఈ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయడంతో అధికారులు, అధికారపార్టీ నేతలు నిర్లక్ష్యం వహించారు. ఇళ్ల కాలనీ నిర్మాణంలో అవకతవకలు జరిగాయని అప్పటి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిలక్ 2019 నవంబరులో ఆరోపించారు. ఈ క్రమంలో లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించలేదు. ఎన్నికలు సమీపిస్తున్నాయనే ఉద్దేశంతో గత నవంబరులో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ వాణి హడావుడిగా 92మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. అంతవరకు బాగానే ఉన్నా కాలనీలో విద్యుత్ సౌకర్యం లేకపోవడం, మౌలిక సదుపాయాలకు దూరంగా ఉండడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పది కుటుంబాలు మాత్రమే ఉంటున్నాయి. మిగిలిన ఇళ్లు పరిశీలిస్తే మద్యం సీసాలు, అసాంఘిక కార్యక్రమాల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. అపరిశుభ్ర వాతావరణంతో నిండిపోయాయి. ఇళ్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కిటికీలు, తలుపులు పాడైపోయాయి. విద్యుత్ వైర్లు చోరీ కాగా వాటర్‌ట్యాం కులు, ఇతర పైపు లైన్లు ఛిద్రమయ్యాయి. మౌలిక సదుపాయాలకు దూరంగా నిలిచాయి. ఇదిలా ఉండగా టెక్కలిలో హుద్‌హుద్ ఇళ్లను అనర్హులకు, స్థానికేతరులకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ అధికార పార్టీ నేతలు విక్ర యించారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపిస్తున్నారు. అర్హులైన లబ్ధిదారులకు అన్యా యం జరిగిందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. కాగా.. పేదలకు, నిరాశ్రయులకు మాత్రమే గుర్తించి హుద్ హుద్ ఇళ్ల కాలనీలు కేటాయించామని అధికారపార్టీ ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.



హుద్‌హుద్ ఇళ్ల కాలనీ



పగిలిన ఇళ్ల కిటికీలు



చోరీకి గురైన ప్యానల్‌బోర్డు సామగ్రి

- హుద్‌హుద్ ఇళ్ల కాలనీ కేటాయింపులు, మౌలిక సదుపాయాల కల్పన విషయమై సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ వద్ద ప్రస్తావించగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మిగిలిన ఇళ్ల లబ్ధిదారులకు కేటాయించలేదన్నారు. మౌలిక సదుపాయాలకు సంబంధించి ఆయా శాఖలకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు.



శ్రీకాకుళం జామియా మసీదులో ఇఫ్తార్ విందు

నేడే రంజాన్

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 10: ముస్లింల పవిత్ర మాసం రంజాన్ వేడుకలకు మసీదులు సిద్ధమయ్యాయి. భక్తిశ్రద్ధలతో నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు, నమాజ్‌లు, జాకాత్‌లు చేశారు. గురువారం రంజాన్ పర్వదినం సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఈ మేరకు శ్రీకాకుళం జీటీ రోడ్డులోని పురాతనమైన జామియా మసీదులో ఏర్పాట్లు చేశారు. విద్యుత్ వెలుగులతో అలంకరించారు. బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 9గంటల నుంచి రంజాన్ వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, షేక్ జాఫర్, సలీమ్‌ఖాన్, అబ్దుల్ బాషా, ముజీర్, షేక్ రఫీక్, జిలానీ పాల్గొన్నారు.

ఇదీ చరిత్ర

- జామియా మసీదును 1636లో 18ఎకరాల్లో నిర్మించారు. అప్పట్లో కళింగాంధ్రలోని 365 మసీదుల ద్వారా ఖజానా వసూలు చేసేవారు. ఖజానా నుంచి వచ్చిన సొమ్మును, శిస్తును వేరు చేసి రాజధానికి పంపించేవారు. ఈ ఖజానా నిల్వ చేసేందుకు జామియా మసీదు నిర్మించారు. మబగాం, ఖాజీపేట, ఫాజుల్‌బేగ్‌పేట, గుజరాతిపేట, హకింఖాన్ పేట, తాన్‌సాహెబ్ పేట, నిజామాబాద్, షేర్ మహ్మద్ పురం, నరసన్నపేట, గార, ఎచ్చెర్ల తదితర మండలాల్లో 365 మసీదులకు జామియా మసీదు కేంద్రంగా ఉండేది.

ఆ మూడు గంటలు..!

- బావిలో చిక్కుకున్న కూలీ
- కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

నరసన్నపేట, ఏప్రిల్ 10: ఓ బావిలో పూడిక తీసేందుకు ప్రయత్నించిన కూలీ.. నందలు విరిగి అదేబావిలో కూరుకుపోయాడు. వెంటనే ఇంటి యాజమాని అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వగా మూడు గంటలపాటు శ్రమించి.. ఆయన క్షేమంగా బయటకు తీశారు. నరసన్నపేటలోని జమ్ము జంక్షన్ వద్ద కృష్ణానగర్‌లో కూన ప్రమీల ఇంటి ఆవరణలో తాగునీటి బావి పూడికతో పేరుకుపోయింది. బొరిగివలసకు చెందిన కూలీ కోణంగి అప్పన్న.. ఆ పూడికను తీసేందుకు తాళ్ల సహాయంతో బావిలో దిగారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పూడిక తీస్తుండగా బావిలో నాలుగు సిమెంట్ నందలు విరిగి పడిపోయాయి. దీంతో అప్పన్న కూడా బావిలో కూరుకుపోయాడు. వెంటనే ఇంటి యాజమాని ప్రమీల అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. నరసన్నపేట అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి తాళ్ల సహాయంతో ఇద్దరు బావిలోకి దిగి.. జాగ్రత్తగా అప్పన్నను బయటకు తీశారు. సుమారు 3 గంటలపాటు అప్పన్న.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని.. బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అప్పన్నను ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా.. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. అప్పన్నను కాపాడిన అగ్నిమాపక సిబ్బందిని స్థానికులు అభినందించారు.



బావిలో పడిన అప్పన్నను తాళ్ల సహాయంతో బయటకు తీసిన అగ్నిమాపక సిబ్బంది

అడుగంటిన చెరువులు

● సాగు, తాగునీటికి కటకట ● ఇదీ సరుబుజ్జిలి మండలంలో పరిస్థితి

సరుబుజ్జిలి: మండలంలో తీవ్ర నీటిఎద్దడి నెలకొంది. ఎండల తీవ్రతకు 15 వరకు చెరువులు అడుగంటిపోయాయి.ప్రధానరహదారికి ఆనుకుని 500 ఎకరాలకు నీరందించే తమ్మినాయుడుపేట వద్ద చిర్రగట్టు, నందికొండ చెరువు, వెన్నెలవలస జలాశయం బోసిపోతున్నాయి. దీంతో సాగు, తాగునీటికి కటకట తప్పడం లేదు.గత ఏడాది అక్టోబరు, నవంబరులో ఆశించిన వర్షాలు కురవు లేదు. అలాగే ఈ ఏడాది రబీకి సంబంధించి ఫిబ్రవరిలో కాలువల్లో పూడిక తీస్తామని పేర్కొని నీటిని విడిచి పెట్టలేదు. దీంతో వంశధార ఆధారిత 40 వరకు చెరువుల్లో ప్రస్తుతం చుక్కనీరు లేదు.ఈ చెరువుల ఆధారంగా ఐదువేల హెక్టార్ల వరకు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం రబీలో చివరిదశలో ఉన్న పంటలకు నీటి తడులకు రైతులు అగచాట్లుపడుతున్నారు. ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే ఎండలదాటికి చెరువుల్లో చుక్కనీరు లేకపోవడంతో మూగజీవాలకు ఇబ్బంది తప్పడంలేదు. ఈఏడాది ఏప్రిల్‌లో 40 డిగ్రీలు ఉష్ణోగతలు దాటు తుండడంతో పశుపోషకులు అల్లాడిపోతున్నారు. దీనికితోడు జలాశయాల్లో నీరు లేకపోవడంతో నేలబావులను ఆశ్రయించాల్సివస్తోందని వాపోతున్నారు.


బోసిపోతున్న సుబ్బపేట కోనేరు

రబీకి నీరు మళ్లింపు

ప్రధానంగా ఏటా వర్షాలు, వంశధార కుడి కాలువ నీటి లభ్యత ఆధారంగా చెరువులు నింపేవారు. దీంతో ఖరీఫ్, రబీ పంటలకు సాగునీరందేది. ఈ ఏడాది వర్షాలు కూడా అంతంతమాత్రంగా అనుకూలించడంతో పాటు వంశధార కుడి కాలువ ద్వారా కూడా నామమాత్రంగానే నీటిని విడుదల చేశారు. దీంతో జనవరి నాటికి చెరువుల్లో నీటినిల్వలు తగ్గుతూవచ్చాయి. ఈనేపథ్యంలో పలు గ్రామాల్లో రైతులు రబీపంటలు వేయడంతో చెరువుల్లో ఉన్న కొద్ది పాటి నీటిని పంటపొలాలకు మళ్లించారు. దీంతో ఏటీ ప్రధాన రహదారికి ఆనుకునిఉన్న షలంత్రి గ్రామసమీపంలో ఉన్న చేపలవాని చెరువు పూర్తిగా అడుగంటిపోయింది. సుబ్బపేట, ఊర కోనేరు చెరువు గర్భం బీటలు వారింది. చెరువులన్నీ నీరు లేకపోవంతో చివరి దశలో ఉన్న రబీ పంటల సాగుకు, పశువులకు అవసరమైన నీటికోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


ఎండిన చేపలవాని చెరువు

మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

● శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ గంగాధరం


సిబ్బందితో మాట్లాడుతున్న గంగాధరం

టెక్కలి:మద్యం అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసే విధం గా సిబ్బంది విధులునిర్వహించాలని శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్‌డైరెక్టర్ డి.గంగాధరం కోరారు. బుధవారం టెక్కలిలోని ఎస్ఈబీ స్టేషన్‌ను తనిఖీచేశారు. ఈసందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టణ, గ్రామీణ, సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఆయనతో పాటు టెక్కలి ఎస్ఈబీ సీఐ జీ.రాజశేఖర్ నాయుడు, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలి

టెక్కలి: ఎన్నికల విధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ తెలిపారు.బుధవారం టెక్కలిలో నియోజకర్గం పరిధిలోని కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల పరిధిలోని బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

ఎల్.ఎన్.పేట: ఎన్నికల సిబ్బందికి, ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలుకల్పించేందుకు బీఎల్వోలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ రాణిఅమ్మాజి తెలిపారు. బుధవారం ఎల్.ఎన్.పేటలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 43 పోలింగ్ కేంద్రాల్లో ఈసీ నిబంధనల మేరకు విద్యుత్, తాగునీరు సౌకర్యంతోపాటు ఓటర్లు ఓటువేసేందుకు తగినసదుపాయాలు కల్పించాలని తెలిపారు.ఓటర్ల జాబితాలో వృద్ధులు, దివ్యాంగులను గుర్తించి తగిన ఏర్పాట్లుచేయాలని పేర్కొన్నారు. విధులను నిర్వర్తించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై శాఖాపరంగా తగిన చర్యలు చేపడతామని తెలిపారు. సమావేశంలో డీటీ రషీద్‌అహమ్మద్, ఆర్ఐ గవరయ్య, ఎంఈవో-2 కె.చంద్రమౌళి పాల్గొన్నారు.

అనుమానిత బ్యాగులు తనిఖీచేయాలి

● రైల్వే డీఎస్పీ మోహనరావు

పలాస: ఎన్నికలవేళ రైలులో గంజాయి,డబ్బులు తరలే అవకాశం ఉందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండి అనుమానిత బ్యాగులు, వ్యక్తులను తనిఖీలు నిర్వహించాలని రైల్వే డీఎస్పీ బి.మోహనరావు కోరారు.బుధవారం పలాసరైల్వే పోలీస్‌స్టేషన్‌లో తనిఖీచేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం దాడులు కొనసాగించాలని, ఇచ్ఛాపురం నుంచి నెల్లిమర్ల వరకూ ఉన్న పలాస రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని కోరారు. రైలులో నేరాలు పూర్తిగా తగ్గించే విధంగా నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఏడాదిగా జరిగిన క్రైమ్‌పై వివరాలు అడిగితెలుసుకున్నారు.కార్యక్రమంలో సీఐ వెంకటరావు, ఎస్ఐ షరీఫ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు బాసటగా నిలబడాలి: కలమట

కొత్తూరు: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును తాను కలిశానని, రెండు రోజులు సమయం అడిగారని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ తెలిపారు. బుధవారం మాతలలో విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో చంద్రబాబును మంగళవారం కలిసి నియోజకవర్గ పరిస్థితిని వివరించానని చెప్పారు. ప్రతిపక్షంలో పోరాటం చేయా ల్సిందిపోయి స్వప క్షంతో పోరాటం చేయాల్సిరావడం దురదృష్టకరమని తెలిపారు.ఒక పక్క ధనబలం,మరోపక్క ప్రజాబలం మధ్య జరుగుతున్న యుద్ధం లో తనకు బాసటగా నిలవాలని ప్రజలను కోరారు.తనకు జరి గిన అన్యాయంపై ఈనెల 12న పాత పట్నంలో ర్యాలీ చేస్తానని తెలిపా రు. ఈ ర్యాలీలో తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే కలమట మోహనరావు పాల్గొంటారని చెప్పారు.

గంగా-పార్వతి వృత్తాంతంపై ప్రవచనం

శ్రీకాకుళం కల్చరల్: ఉపనిషన్మందిరంలో బుధవారం వసంత నవరాత్రులు నిర్వహించారు. ఈ సందరకభంగా గంగా-పార్వతి వృత్తాంతంపై పులకండం శ్రీనివాసరావు ప్రవచనాలు చేశారు. నర్సింహమూర్తి, రమేష్, ఎస్.నారా యణమూర్తి, పతంజలి శాస్త్రి, నిక్కు అప్పన్న, జి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా వసంత నవరాత్రి ఉత్సవాలు

ఇచ్ఛాపురం: టి.బరంపురంలో సీతారామ వసంత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం రెండో రోజు స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి స్వరనీరాజన కార్యక్రమంలో వాసురెడ్డి బృందం సంగీత భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు దర్శించుకున్నారు. అనంతరం కళాకారులకు ఎంపీపీ బోర పుష్ప, సర్పంచ్, మాజీ సర్పంచ్ గ్రామ పెద్దలు సాలువులతో సత్కరించి షీల్డులు అందించారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్ లేదా తత్సమాన ఉత్తీర్ణత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకో వాలని పేర్కొన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు

నరసన్నపేట:స్థానిక కంబాయిజంక్షన్ వద్ద జలగల చెరువుకుచెందిన స్థలంలో అక్రమ నిర్మాణాలను పంచాయతీ అధికారులు బుధవారం అడ్డుకున్నారు. తమ జిరాయితీ స్థలం పక్కనేగల చెరువు పోరంబోకు స్థలాన్ని చదునుచేసి నిర్మాణాలు చేసేందుకు ఉపక్రమించారు.ఈవో చిన్నారావు ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు రంగంలోకి దిగి ఆక్రమణలు తొలగించారు.

కృష్ణమూర్తికి ఉగాది పురస్కారం

పలాస రూరల్: ఉగాది పురస్కరించుకుని శ్రీకాకుళంలో రచయితలసంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలోఉత్తరావిల్లిఊసులు పుస్తకావిష్కరణ, కవిసమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా జనజాగృతి సాహితీసమాఖ్య గౌరవాధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తి పలుకే బంగారంఅన్న కవితాగానం చేశారు. దీంతో నిర్వాహకులునాగేశ్వరరావు, ఆర్వీ రమణమూర్తి కృష్ణ మూర్తిని సత్కరించి ప్రశంసాపత్రం, అవార్డును అందజేశారు.

'కాసూరి' ప్రజాకళలకు అంకితం

పలాస: స్థానిక సూదికొండకాలనీ న్యూడెమోక్రసీ కార్యాలయంలో అరుణోదయసాంస్కృతిక సామాఖ్య జిల్లా అధ్యక్షుడు సొర్ర రామారావు ఆధ్వర్యంలో ఆ సంస్థ వ్యవస్థాకులు కాసూరి వెంకటేశ్వరరావు తొమ్మిదో వర్ధంతి బుధవారంనిర్వహించారు.ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఏడు దశాబ్దాలపాటు ప్రజాజీవితంలో ప్రజా కళలకు అంకితమైన వెంకటేశ్వరరావు సేవలు ప్రశంసనీయమన్నారు. కవి, రచయత, బుర్రకథ కళాకారునిగా విప్లవ సాంస్కృతిక ఉద్యమాన్ని నడిపారని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు వంకల మాధవరావు,సోమేశ్వరరావు, వినోద్, పాపయ్య, ఆనంద్, సరస్వతి పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలేకు నివాళి

నందిగాం: పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాలలో సంఘ సంస్కర్త జ్యోతి రావుపూలే జయంతిని బుధవారం నిర్వహించారు. హెచ్ఎం కె.గున్నయ్య ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.శంకరరావు, వి.కుమారి, పి.వనిత పాల్గొన్నారు.

నందిగాంలో జీపీడీపీ పరిశీలన


మాట్లాడుతున్న ఆనందరావు

నందిగాం: నందిగాం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను(జీపీడీపీ) బుధవారం డీపీఆర్‌సీ రిసోర్స్‌పర్సన్ పి.ఆనందరావు పరిశీలించారు.ఈసందర్భంగా కార్యదర్శులకు 2024-25 సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికల వివరాలపై ఈవోఆర్డీ రాజారావు, వజ్రపుకొత్తూరు ఎంపీడీవో డి.తిరుపతిరావు సూచనలుచేశారు. కార్యక్రమంలో ఎంటీలు కె.చంద్రరావు, కె.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పాతపట్నంలో వ్యాసరచన పోటీలు

పాతపట్నం:స్థానిక షిర్డీగిరిపైగల షిర్డీసాయి ధ్యాన మందిరంలో వసంతోత్సవాలు పురస్కరించుకుని బుధవారం వ్యాసరచన పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. వేడుకల్లోభాగంగా గురువారం భక్తిగీతాల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

కల్యాణ మండపానికి రూ.50 వేలు

పాతపట్నం:రొంపివలలో హరేరామ కల్యాణ మండప నిర్మాణానికి రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పారసిల్లి రామరాజు రూ.50 వేలు ఇచ్చారు. ఈ మేరకు బుధవారం కల్యామ మండప నిర్మాణ నిర్వాహకులకు చెక్కును అందజేశారు. కల్యాణ మండప నిర్మాణానికి అవసరమైన ముఖద్వారం, తలుపులు,కిటికీలు ఏర్పాటుకు ఈ నిధులు వినియోగిస్తామని మాజీ సర్పంచ్ తూలుగు తిరుపతిరావు, గణపతి నీలకంఠం తెలిపారు.

దిమ్మడిజోలలో భాగవత సప్తాహం

నందిగాం:దిమ్మిడిజోలలో శ్రీరామనవమి మహోత్సవాలు పురస్కరించుకుని భాగవత సప్తాహం బుధవారం ప్రారంభించారు. నిర్వాహకుల ఆధ్వర్యంలో రామాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. తొలుత ఉదయం నగరసంకీర్తణ జరిపారు. భాగవత సప్తాహం 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కొళాయిల ద్వారా బురద నీరు



హిరమండలం: హిరమండలంలో కొళాయిల ద్వారా 15 రోజులుగా బురద నీరువస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ వంశధార రిజర్వాయర్ ద్వారా సుమారు 100 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఉద్దానానికి శుద్ధి చేసి నీటిని పంపిస్తున్నా, స్థానికులకు మాత్రం కలుషిత నీరందిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కొళాయిల ద్వారా శుద్ధజలాలు సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

నరసన్నపేట అభివృద్ధికి కృషి

●నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థి బగ్గు రమణమూర్తి


నరసన్నపేట ప్రశాంత్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బగ్గు రమణమూర్తి

నరసన్నపేట:నరసన్నపేటపట్టణాన్ని మరింతఅభివృద్ధికి కృషిచేస్తానని నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి తెలిపారు. బుధవారం పట్టణంలోని గాంధీనగర్, ప్రశాంత్‌నగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించి, సూపర్‌సిక్స్‌పథకాలను ఇంటింటా వివరించారు.నిరుద్యోగులకు భృతి, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివే అందరికీ విద్యాదివెన వంటి పథకాలను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి పార్టీల నాయకులు బలగ ప్రవీణ్, ఉణ్న వెంకటేశ్వరరావు, పీస కృష్ణ, బలగ ప్రహర్ష, రేణంకి కృష్ణంనాయుడు, గురుగుబెల్లి ఝాన్సీ పాల్గొన్నారు.

● **పోలాకి:** సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు మేలు చేకూరుస్తాయని టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి తెలిపారు. మండలంలోని వెదుళ్లవలస, పోలాకి, గంటపేట, ఇందిరానగర్, విశ్వేశ్వరనగర్‌ల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు మిరియబ్బిల్లి వెంకట అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బైరి భాస్కరరావు, నారాయణదాస్, మెండ శ్రీనివాసరావు, డోల ప్రసాదరావు, చిట్టిసింహాచలం, కె.రాంబాబు, యందవ హరికృష్ణ, అర్జాల విష్ణు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పలకాలి

● పాతపట్నం నియోజకవర్గ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు


భగీరథపురంలో ప్రచారం నిర్వహిస్తున్న మామిడి గోవిందరావు

హిరమండలం:వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పలకాలని పాతపట్నం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని భగీరథపురం, పిండ్రువాడ, పిండ్రువాడ కాలనీల్లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారంలోకి వస్తే టీడీపీ అమలుచేయనున్న సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఎన్డీఏ కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం, సమన్యాయం సాధ్యమ న్నారు. స్థానికేతరులపాలనలో అభివృద్ధి కుంటుపడిందని, స్థానికేతర నాయకులను ఈ ఎన్నికల్లో ఓటుతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాంధీ, సలాన మోహనరావు, గోవిందరావు, దశరధ, కమలాకర్ పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

పలాస రూరల్: మండలంలోని చినంచల పంచాయతీ పరిధిలో గల గంగువాడ, కేదారిపురం, ఈదురాపల్లిల్లో బుధవారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారంచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్‌రావు,దువ్వాడసంతోష్, తమ్మినేని గంగారామ్, పైలచక్రధర్, పైల విష్ణుమూర్తి, ప్రభుదాస్, కంచరాన అనిల్, బీజేపీ జనసేన నాయకులు పాల్గొన్నారు.

●**కాశీబుగ్గ:**రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు వజ్జ బాబురావు,లొడగల కామేశ్వరరావు యాదవ్ కోరారు.పలాస కాశీబుగ్గ మునిసిపాలిటీపరిధిలో గల ఐదోవార్డులో తాళభద్ర, నీలాపురంలోప్రచారం నిర్వహించి,ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, సూర్యనారాయణ ,సప్ప నవీన్,ఉమాకాంత్, జానకిరావు, రమేష్, సింహాద్రి, మన్మథరావు పాల్గొన్నారు.

● **నందిగాం:** మండలంలోని శివరాంపురంలో బుధవారం టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పి.అజయ్‌కుమార్, ఎం.బాలకృష్ణ, ఎస్.జానకిరాం, బి.సన్యాసిరావు, గిరిబాబు, తాడేల చిరంజీవి, కె.హరిబాబు, ఆర్.రామారావు పాల్గొన్నారు.

● **జలుమూరు:** టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జడ్పీటీసీ మాజీ సభ్యురాలు, నరసన్నపేట అభ్యర్థి బగ్గు రమణమూర్తి భార్య సుగుణమ్మ తెలిపారు. బుధవారంమండలంలోని కూర్మనాదపురం, రామయ్యవలసల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో దాడులు, దౌర్జన్యాలు, దోపిడీలు తప్ప రాష్ట్రాభివృద్ధి శూన్యమన్నారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, కన్వీనర్ బగ్గు గోవిందరావు, టీడీపీ నాయకులు బోడేన బాలకృష్ణ, కింజరాపు సత్యం, సనపల రమణ, మొయ్యి శ్రీనివాసరావు,స్వామిబాబు పాల్గొన్నారు.

టీడీపీలో 200 మంది చేరిక

హరిపురం: మందస మండలంలోని పెద్ద కేసుపురం, చిన్నకేసుపురం, గుజ్జువారిగుడ్డి, కర్రివానిపేట గ్రామాల నుంచి 200మంది వైసీపీని వీడి టీడీపీలో బుధవారం చేరారు. వీరికి పలాస నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.ఈసందర్భంగా పార్టీలో చేరినవారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసీపీలో చేరి గెలిపిస్తే కనీసం తమ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదని వాపోయారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, దాసరి తాతారావు, లబ్బరుద్రయ్య, దామోదరం,మడియా ధర్మారావు, గుజ్జు తులసయ్య, మురళి, తిమ్మల హరికృష్ణ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో బంగారు భవిష్యత్

సూపర్‌సిక్స్ పథకాలతో బంగారు భవిష్యత్తు లభిస్తుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌతుశిరీష తెలిపారు. మందస మండలంలోని సాబకోట, చీపి పంచాయతీల పరిధిలో పలుగ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాబువస్తే సంపద సృష్టించి పథకాలు పంపిణీ చేస్తారని, అప్పులతో పనిలేదని, పన్నులు విధించరని వివరించారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు రట్టిలింగరాజు,భాస్కరరావు, రామారావు,మహేష్, చిరంజీవి పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన నాయకులతో గౌతు శిరీష

అవలంగి పాఠశాలకు గుర్తింపు

బెస్ట్ ఆన్ ఆల్ ఇండియా రేటింగ్ ఆఫ్ గ్రీన్ స్కూల్ ప్రశంసాపత్రం

హిరమండలం:మండలంలోని అవలంగి జడ్పీఉన్నత పాఠశాలకు అరుదైన గుర్తింపు లభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.గొల్లవాడు చెప్పారు. 2022 ఆగస్టు 15 నుంచి పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థుల పుట్టిన రోజున, ఇతర శుభ కార్యక్రమాలు జరిగే రోజుల్లో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించేలా చర్యలు చేపట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు సలహాలతో విద్యార్థులను ఆరు ఏకో క్లబ్‌లుగా ఏర్పాటు చేసి మొక్కలు పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషికి గుర్తించి సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ గ్రీన్ స్కూల్స్ ప్రోగ్రాం పేరుతో నిర్వహించిన జీఎస్పీ ఆడిట్ రేటింగ్-2024 పసుపు గ్రేడ్ లభించింది.


ప్రశంసాపత్రంతో విద్యార్థులు,ఉపాధ్యాయులు

ఈమేరకు బెస్ట్ ఆన్ ఆల్ ఇండియా రేటింగ్ ఆఫ్ గ్రీన్ స్కూల్స్ ప్రశంసాపత్రాన్ని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సీఎస్ఈ సునీత నారాయణ అందజేసినట్టు గొల్లవాడు చెప్పారు.

జామియా మసీదులో ఇఫ్తార్ విందు

కాశబుగ్గ: కాశీబుగ్గ జామియా మసీదులో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు.కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త యర్లగడ్డ వెంకన్న చౌదరి,లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, జామియా మసీదు అధ్యక్షులు షేక్ భాషా,సెక్రటరీ జమీల్, షేక్ గౌస్,ఉక్తార్ ఆలామ్, సూర్యనారాయణ, నర్సింగులు, యుగంధర్ పాల్గొన్నారు.


ప్రార్థనల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

'నాడు-నేడు' పనులు పూర్తిచేయాలి: ఎంఈవో

నరసన్నపేట: నాడునేడు పనులను సకాలంలో పూర్తి చేయించాలని ఎంఈవో పి.దాలినాయుడు సూచించారు.బుధవారం నరసన్నపేట ప్రభుత్వోన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభంనాటికి పనులు శతశాతం పూర్తి కావాలన్నారు. అనంతరం టోఫెల్ పరీక్షలను ఆయన పరిశీలించారు.ఎంఈవో -1 ఉప్పాడ శాంతారావు బొరిగివలస, దేశవానిపేట పాఠశాలలో ఎండీఎంను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్రావు, ఉపాధ్యాయులు సాయిశ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

నిబంధనల ప్రాప్తికి పనులు చేయించాలి: ఏపీవో

ఎల్.ఎన్.పేట:ఉపాధిపనులను వేతనదారులతో నిబంధనల ప్రాప్తికి చేయించాలని ఏపీవో శ్రీదేవి తెలిపారు. బుధవారం మండలపరిషత్ కార్యాలయంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఉపాధిసిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడంతో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6గంటల వరకు వేతనదారులతో పనులుచేయించి కూలిగిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉదయం ఏడు గంటల్లోగా పనులు జరుగుతున్నట్లు తన లాగిన్‌కు ఫొటోలు పంపించకపోతే ఫీల్డ్‌అసిస్టెంట్లపైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.సమావేశంలో ఈసీ సూర్యారావు, టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

చెక్ పోస్టులను పటిష్ఠం చేయండి

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

పొందూరు: ఎన్నికల సమీపిస్తున్న దృష్ట్యా డబ్బు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టులను పటిష్ఠపరిచి సిబ్బందిని అప్రమత్తం చేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాపాక చెక్‌పోస్టును కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తనిఖీ చేశారు. అనుమానం ఉన్న ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. రాత్రిపూట మద్యం అక్రమ రవాణా కాకుండా చూడాల్సిన బాధ్యత ఎస్ఈబీ అధికారులతో పాటు చెక్‌పోస్టు, పోలీసు అధికారులపైనా ఉందన్నారు. అనుమానం ఉంటే రాజకీయ నాయకుల వాహనాలను తనిఖీ చేసేందుకు వెనుకాడవద్దని ఆదేశించారు. తహసీల్దార్ ఎం.పాల్‌కిరణ్, ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ, ఎస్ఐ వై.రవి, ఎంఈవో పి.రాజా రావు తదిరులు ఉన్నారు.



పొందూరు: రాపాక చెక్‌పోస్టు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పాఠశాల పరిశీలన

పాఠశాలల్లో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని, ఆ బాధ్యత పాఠశాల సిబ్బంది, అధికారులదేనని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ హెచ్చరించారు. రాపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్యపై పలుమార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనికీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో పి.రాజారావుకు పలు సూచనలు చేశారు.

మౌలిక వసతులు కల్పించాలి

జి.సిగడాం: పోలింగ్ కేంద్రాలు వద్ద పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ మన్‌జీర్ జిలాని సమూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు గొబ్బూరు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్‌ను దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాలు వద్ద టెంట్లతో పాటు తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. ఏఎంఎఫ్, షాడో ప్రాంతాలు, రూట్ మ్యాప్‌లు, కమ్యూనికేషన్ ప్లాన్లపై సమీక్షించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తి, తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, ఎస్ఐ వై.మదుసూదనరావు, ఆర్ఐ రామచంద్రరావు, ఎంఈవో అరసాడ రవి తదితరులు ఉన్నారు.

ఐఎంఎల్ డిపో పరిశీలన

ఎచ్చెర్ల: ఎన్నికల నేపథ్యంలో ఎచ్చెర్లలోని బేవరేజస్ కార్పొరేషన్ ఐఎంఎల్ డిపోను కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ బుధవారం పరిశీలించారు. ఐఎంఎల్ డిపోలో మద్యం స్టాక్ వివరాలను అడిగి కలెక్టర్ తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు. తొలుత తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు.

మద్యం సీసాలు స్వాధీనం

శ్రీకాకుళం క్రైం: నగరంలో నిబంధనలకు విరుద్ధంగా ఎనిమిది (180 ఎంఎల్) మద్యం సీసాలు తరలిస్తున్న ఒక వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక ఆరంగివారి వీధికి చెందిన పొట్నూరు మణికంఠ అనే వ్యక్తి బుధవారం ఎనిమిది మద్యం సీసాలు బ్యాగులో తీసుకుని వెళ్తుండగా వన్‌టౌన్ పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ బలివాడ గణేష్ అతనిని విచారించగా ఇంట్లో మద్యం విక్రయాలు జరిపేందుకు మద్యం తరలిస్తున్నట్టు మణికంఠ అంగీకరించాడు. దీంతో అతనిపై ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేశారు.

జొన్నలపాడులో..

గార: జొన్నలపాడు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలో 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎ.కృష్ణప్రసాద్ తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

కార్మిక వ్యతిరేకులను ఓడించాలి



విమలా రణదివే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అరసవల్లి: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ, దానికి మద్దతుగా నిలబడుతున్న పార్టీలను రానున్న ఎన్నికలలో ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. నగరంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అధ్యక్షతన జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశం బుధవారం జరిగింది. ముందుగా ఉద్యమనేత కామ్రేడ్ విమలా రణదివే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సింగరావు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ రంగంలో ఒక్క సంస్థ కూడా మిగలదని, మొత్తం కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోతాయన్నారు. మే డేను జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, పారిశ్రామిక కేంద్రాల్లో నిర్వహించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కె.నాగమణి, ఎం.ఆదినారాయణమూర్తి, ఎన్వీ రమణ, హెచ్.ఈశ్వరరావు, కె.సూరయ్య, ఆర్.ప్రకాష్, బి.ఉత్తర తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ద్వారా ఆధార్ సేవలు



రికార్డులు పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

ఇచ్ఛాపురం: పోస్టల్ కార్యాలయం ద్వారా ఆధార్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని, ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ ఎ.హరిబాబు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఇచ్ఛాపురం పోస్టల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి సేవలు అందిస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు విస్తృతంగా సేవలు అందించాలని సూచించారు. ఉదయం 8 గంటల నుంచి 12గంటల వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు పోస్టల్ ద్వారా మరింతగా సేవలు అందించేందుకు సేవింగ్ అకౌంట్ కౌంటర్ మరొకటి అదనంగా ఏర్పాటు చేశామని, దీంతో పాటు ఆధార్ సెంటర్ సేవలు కూడా ప్రారంభించామని తెలిపారు. కొత్త ఆధార్ కార్డులతో పాటు పాత ఆధార్ కార్డుల్లో చేర్పులు మార్పులుకు అవకాశం ఉందన్నారు. కొత్త ఆధార్‌కు రూ.100, పాత కార్డులో చేర్పులు మార్పులకు ఒకదానికి రూ.50, అంతకంటే ఎక్కువ మార్పులకు రూ.100 చెల్లించాలని తెలిపారు. పోస్టల్ ఖాతాదారుల రద్దీ పెరగడంతో ఖాతాదారులకు ఇబ్బంది లేకుండా అదనంగా మరో సేవింగ్ కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ ద్వారా అందిస్తున్న ఇన్సూరెన్స్ సేవలను కూడా ప్రజలు వినియోగించుకోవాలన్నారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

హోమియో పితామహుడు హనీమూన్



జగతిలో హనీమూన్ విగ్రహానికి నివాళులు

కవిటి: హోమియో పితామహుడు శ్యామ్యూల్ హనీమూన్ అని జగతి సర్పంచ్ పి.వరప్రసాద్ అన్నారు. జగతి గ్రామంలో హనీమూన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి బుధవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామస్థులు బి.సీతారామూర్తి, పి.జగదీశ్వరరావు, ఎస్.పద్మనాభం, ఎల్.తవిటయ్య ఎల్.ప్రభాకరరావు, ఎం.తేజేశ్వరరావు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో

సోంపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్వో సుదర్శన్ దొర అన్నారు. నాలుగు మండలాల పోలింగ్ సిబ్బందితో జూనియర్ కళాశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సమావేశంలో సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం తహసీల్దార్‌లు, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

నిబద్ధతతో రాణించాలి



వర్సిటీలో విద్యార్థులు రూపొందించిన న్యాయదేవత నమూనాను పరిశీలిస్తున్న వీసీ కేఆర్ రజని తదితరులు

ఎచ్చెర్ల: ఎంపిక చేసుకున్న రంగంలో అంకితభావం, నిజాయితీ, నిబద్ధతతో రాణించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ రెక్టార్ బిడ్డిక అడ్డయ్య అన్నారు. వర్సిటీలో న్యాయ విభాగపు చివరి సంవత్సరపు విద్యార్థులకు బుధవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వృత్తిలో గుర్తింపు పొందేందుకు తగిన సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయ విభాగపు కోఆర్డినేటర్ వై.రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు జి.జయలక్ష్మి, జేకేఎల్ సుజాత, మన్మథరావు, బాలకృష్ణ, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వర్సిటీ వీసీ కేఆర్ రజని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఆంధ్రుల కొంపముంచిన ఒక్క చాన్సు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్



ప్రచారం నిర్వహిస్తున్న రవికుమార్

ఆమదాలవలస: రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో సైకో జగన్‌రెడ్డి ఒక్క చాన్సు అంటూ మోసగించిన తీరు ఆంధ్రుల కొంప ముంచిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. బుధవారం వంజంగి, వంతెంగిపేట గ్రామ పంచాయతీల్లో మాజీ సర్పంచ్ ఎండ అప్పలనాయుడు, సర్పంచ్ పైడి లక్ష్మి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ, జనసేన కన్వీనర్లు సూరప్పనాయుడు, రామ్మోహన్‌రావులతో కలిసి రవికుమార్ ఇంటింటికి వెళ్లి కరప త్రాలు అందించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం రావాలన్నారు. ఈ సందర్భంగా వంజంగి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా వంజంగి గ్రామంలో చిగులపల్లి తులసమ్మ అనే వృద్ధురాలు రవికుమార్‌ను పట్టుకొని వృద్ధుల ఆయుష్ పోసుకుని వందేళ్ల ప్రజల కోసం పరిపాలించాలని దీవించడం పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూకరాజు, సలపల డిల్లీశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, మెట్ట సుజాత, హనుమంతు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తున్న మంత్రి ధర్మాన: గొండు



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్

అరసవల్లి: మంత్రి ధర్మాన అబద్ధాలతో ప్రజలను తరచూ మోసం చేస్తుంటారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి గొండు శంకర్ ఆరోపించారు. బుధవారం స్థానిక విశాఖ-ఏ కాలనీలో గల పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలో పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి సవాలక్ష నిబంధనలతో అనుమతులు లభించక ఇబంది పడుతున్నారన్నారు. ఐదు నెలల కిందట మంత్రి ధర్మాన నగరంలో పది అడుగుల రహదారి ఉన్న ప్రాంతాల్లోనూ ఇళ్ల నిర్మాణానికి అనుమతులు రాబోతున్నాయని చెప్పారని, ఇంతవరకు అది అమలు కాలేదున్నారు. ఇలా ప్రతిదీ అబద్ధాలు ఆడుతున్న మంత్రి ధర్మాన తక్షణమే నగర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే కల్లేపల్లిలో మాజీ ఎంపీపీ కుమారుడు, వైసీపీ నేత జయానంద్, సర్పంచ్, వార్డు సభ్యులతో సహా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మూకళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థి గొండు శంకర్ సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే నానుబాల వీధిలో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శవ్వాన ఉమామహేశ్వరి, చల్లా వెంకటేశ్వరరావు, పీవీ రమణ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న చంద్రమోహన్

లావేరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమితో అభ్యర్థులు గా పోటీ చేస్తున్న నడుకుదిటి ఈశ్వరరావు, కలిశెట్టి అప్పలనాయుడు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ పిలుపునిచ్చారు. బుధవారం సుభద్రా పురం జంక్షన్‌లో గల పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల తో సమావేశం నిర్వహించారు. త్వరలో మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విశ్వక్సేన్, గోవిందరెడ్డి, బి.దుర్గారావు, కాకర్ల బాబ్జి, వి.శ్రీనివాసరావు, కె.రాజేష్, బలరాం, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మంచి భవిష్యత్: అశోక్



కంచిలి: ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

కంచిలి: భావితరాలకు బంగారు భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని బెల్లుపడా, రేఖాదేవిపురం గ్రామాలలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజుతో కలసి సూపర్ సిక్స్‌పై ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైసీపీ పాలనతో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. కార్యక్రమంలో బంగారు కురయ్య, మాదిన రామారావు, పైల పురుషోత్తం రెడ్డి, రామారావు, మన్మధరావు, కురయ్య, తెదేపా, జనసేన, భాజాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం:** సమష్టి కృషితో విజయం సాధించవచ్చునని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఎన్డీఏ కూటమి నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలకు చెందిన కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలన్నారు. కూటమి నాయకులు బుద్దాల నిర్మలా రెడ్డి, కాళ్ల ధర్మారావు, నందికి జాని సదానంద రౌలో తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా: ఎన్ఈఆర్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఈఆర్

జి.సిగడాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వాలని, తద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్డీఏ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) కోరారు. బుధవారం ఆనందపురం, వాండ్రంగి, దేవరవలస, వెలగాడ, మదుపాం, కప్పరాం, చెట్టుపొదిలాం, ఎస్పీఆర్ పురం, జి.సిగడాం గ్రామాల్లో ఆత్మీయ కలయికలో భాగంగా ప్రచారాన్ని నిర్వహించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన వైసీపీ సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ బుధవారం టీడీపీలో చేరారు. సర్పంచ్ ఈశ్వరమ్మతో పాటు ముద్దాడ గౌరీశ్వరరావు ఎన్ఈఆర్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎన్ఈఆర్ టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, కంచరాన సూరన్నాయుడు, టి.మౌళీశ్వరరావు, దాసు, నక్క మురళీ, కుదిరెళ్ల బుజ్జి, బోగాది అప్పలనాయుడు, బాలబొమ్మ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు: జేసీ



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ నవీన్

ఆమదాలవలస: సార్వత్రిక ఎన్నికల్లో అధికారులు ఎటువంటి నిర్లక్ష్యం వహించొద్దని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. బుధవారం ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో పొందూరు, ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి మండలాలకు చెందిన బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. జేసీ నవీన్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం దివ్యాంగులకు, వృద్ధులకు, దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దనే ఓటు వేయడానికి కల్పించిన అవకాశంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అభ్యర్థుల ప్రచారాలు పోలింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన చర్యలు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఎన్నికల డీటీ మురళీధర్‌నాయక్, తహసీల్దార్లు రమేష్‌బాబు, వేణుగోపాల్, అంబేడ్కర్ సెక్టార్ అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కాశీబుగ్గ సబ్‌రిజిస్ట్రార్‌పై కేసు నమోదు

పలాస: కాశీబుగ్గ సబ్‌రిజిస్ట్రార్ తవిటిరాజుపై ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని కేసు నమోదుచేసినట్లు కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు తెలిపారు. గత నెల 26న ఎన్నికల కోడ్ అమలులో ఉండడంగా మంత్రి అప్పలరాజు నివాసంలో ఆయన మంత్రితో భేటీ అయ్యారని చెప్పారు. ఈ మేరకు సీ-యాప్‌లో తెలుగుదేశం పార్టీ నాయకులు ఫిర్యాదు మేరకు విచారణాధికారిగా మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రబాబును నియమించారు. తవిటిరాజు నుంచి లిఖితపూర్వకంగా వాంగ్మూలం సేకరించి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ నివేదిక పంపించారు. ఆయన ఆదేశాల మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు పారినాయుడు తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కూల్ కిట్లు



ట్రాఫిక్ పోలీసులకు కూలింగ్ కిట్లు అందిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైం: అనునిత్యమూ రోడ్లపై మండు టెండల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కూల్ కిట్లు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వరం చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో వేసవి తాపాన్ని తట్టుకునేందుకు క్యాప్, చలవ కళ్లద్దాలు, వాటర్ బాటిల్స్‌లను 70 మంది ట్రాఫిక్ పోలీసులకు ఎస్పీ జీఆర్ రాధిక చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సేవలను ఎస్పీ కొనియాడారు. ట్రస్టు ద్వారా అందించిన సామగ్రి ఎండ తీవ్రతను తట్టుకుని మరింత ఉత్సాహంగా ట్రాఫిక్ విధులు నిర్వహించేందుకు పోలీసులకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, వరం చారిటబుల్ ట్రస్టు సభ్యులు అంధవరపు ప్రసాద్, సంతోష్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఆమదాలవలస: ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని క్రాంతి పథం అసిస్టెంట్ మేనేజర్ పైడి కూర్మారావు స్వయంశక్తి సంఘాల మహిళలకు పిలుపునిచ్చారు. అక్కివరం, బెలమాం గ్రామాల్లో ఓటు హక్కుపై అవగాహనా ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సంఘ ప్రతినిధులు రేణుక, సుశీల, పావని, రాజేశ్వరి, వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు చంద్రరావు, రమణతో పాటు మహిళా సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలే లక్ష్యం



మాట్లాడుతున్న సీఐ ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం క్రైం: రానున్న సార్వత్రిక ఎన్నిక లు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహక రించాలని టూ టౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవా రం స్థానిక పెద్దరెల్లివీధిలోని పోలింగ్ కేంద్రాలను, ఇన్, ఔట్ దారులను పరిశీలించి ఓటింగ్‌పై ఆ వీధివాసులకు అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా పూర్తి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరికృష్ణ, ఏఎస్ఐ అరుణ, పోలీసు సిబ్బంది, డివిజన్ నాయకులు కల్యాణ్ జ్యోతి పాల్గొన్నారు

కెరీర్ గైడెన్స్ కోర్సు పూర్తిచేయాలి

ఎచ్చెర్ల: హైస్కూల్‌ల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దీక్ష కెరీర్ గైడెన్స్‌ను పూర్తిచేయాలని జిల్లా అకడమిక్ మోనటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ అన్నారు. ఎస్ఎస్ఆర్ పురం, బుడగ ట్లపాలెం, ఏపీ మోడల్ స్కూల్ కుప్పిలి పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీక్ష ప్లాట్ ఫార్మ్ ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్స్, టీజీటీలు, పీజీటీలు మే 1వ తేదీలోగా ఐదు కోర్సుల్లో విధిగా రిజిస్టరై, 10వ తేదీలోపు కోర్సులను పూర్తిచేసి సర్టిఫికేట్లు పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టీఏఆర్ఎల్ కోఆర్డినేటర్ జి.గొల్ల, హెచ్ఎంలు టి.జయలక్ష్మి, కె.అప్పాజీరావు, పి.మోహనరావు, సీఆర్పీ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కూలి గిట్టుబాటయ్యేలా చర్యలు

జి.సిగడాం: ఉపాధి వేతనదారులకు కూలీ గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ లోకేష్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. కొలతలు ప్రకారం పనిచేస్తే వేతనం రోజుకు రూ.280 తక్కువ లేకుండా వస్తుందన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పని ప్రదేశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎంపీడీవో వెంకన్నబాబు, ఏపీవో సీహెచ్ సత్యనారాయణ, ఈసీ పురుషోత్తమరావు, టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ ఉపన్యాసాలు చేయొద్దు

కలెక్టరేట్: రాజకీయ నాయకులు దేవాలయాలు, చర్చిలు, మసీదులు సందర్శించినప్పుడు కుల, మత, ప్రస్తావన చేయకూడదని, రాజకీయ ఉపన్యాసాలు చేయరాదని, పార్టీకి సంబంధించిన గుర్తులను వాడరాదని శ్రీకాకుళం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి సీహెచ్ రంగయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహుమతులు పంచరాదని, ఎటువంటి వాగ్దానాలు చేయరాదన్నారు. ఎన్నికల సంఘం నియమించిన వీడియో సర్వైలెన్సు బృందం కూడా ఉంటుందని, ప్రతీ మాట, చర్య రికార్డు చేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

కామర్స్ క్లబ్ వార్షిక సమావేశం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఎంకామ్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో కామర్స్ క్లబ్ వార్షిక సమావేశం బుధవారం ఘనంగా జరిగింది. ఏడాది పొడగునా నిర్వహించిన కార్యక్రమాలు, సమావేశాల నివేదికను ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎస్.సంతోష్ రంగనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలో గల సీఐ, ఎస్ఐలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నామినేషన్ల సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్ ప్రక్రియ జరిగేలా చూడాలని సూచించారు. అన్ని రూట్లలో పోలింగ్ వాహనం అసెంబ్లింగ్, సోంపేటలో స్ట్రాంగ్ రూమ్ వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. నామినేషన్ సమయంలో లా అండ్ ఆర్డర్ పరిస్థితిపై చర్చించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేడు పార్కిన్సన్స్ వ్యాధిపై అవగాహన

గుజరాతీపేట: స్థానిక డే అండ్ నైట్ దగ్గరలో గల బ్రిడ్జికు ఆనుకుని ఉన్న పైల లక్ష్మీనారాయణ ఆసుపత్రి ఆవరణలో వరల్డ్ పార్కిన్సన్ డే సందర్భంగా గురువారం ఆ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ప్రగతిశీల దీర్ఘకాలిక క్షీణత వ్యాధి నాడీ వ్యవస్థపై ప్రభా టవితం చేస్తుందని, ఇది వెయ్యి మందిలో ఒకరిద్దరికి ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ పైల లక్ష్మీనారాయణ అన్నారు. ఇది ఎక్కువగా నిద్రలేమి వల్ల, తగినంత నీరు తీసుకోకపోవడం వల్ల, మద్యం, ధూమపానం వల్ల వస్తుందన్నారు.

బూటకపు చేరికలు మానుకోవాలి

ఆమదాలవలస: నియోజకవర్గంలో వైసీపీ బూటకపు చేరికలతో ప్రజలను తప్పుదోవ పట్టించే విధానాన్ని మానుకోవాలని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొర్లకోట గ్రామానికి చెందిన యువకులు స్పీకర్ తమ్మినేని సీతారాం ఆధ్వర్యంలో వైసీపీలో చేరినట్టు వివిధ మాధ్యమాల్లో చేసిన ప్రచారంలో వాస్తవం లేదన్నారు. నిజానికి ఆ ఫోటోలో ఉన్న యవకుల్లో కొర్లకోట గ్రామానికి చెందిన వారు నలుగురే ఉన్నారని, అంతేకాకుండా తమ గ్రామంలో వైసీపీకి మూడు గ్రూప్‌లు ఉన్నాయన్నారు. ఆ గ్రూప్‌ల్లోని వారే అటు నుంచి ఇటు.. ఇటునుంచి ఆటు మారుతున్నారన్నారు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు ఇటువంటి ప్రచారం చేస్తున్నారన్నారు.

మెట్టక్కివలసలో ప్రచారం

ఆమదాలవలస: పట్టణంలోని మెట్టక్కివలస ప్రాంతంలో బుధవారం స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకలు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అంజనీకుమారి, ముత్తా విజయకుమార్, రవికాంత్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే స్వర్ణయుగం

అరసవల్లి: చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తే ఈ రాష్ట్రానికి మళ్లీ స్వర్ణయుగం వస్తుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికలు.. జగన్‌రెడ్డి అరాచక పాలనకు, చంద్రబాబు చేపట్టబోయే అభివృద్ధికి మధ్య జరిగే పోరాటమన్నారు. జగన్‌రెడ్డి ఈ ఐదేళ్ల పాలనలో అన్ని వ్యవస్థలు సర్వనాశనం అయిపోయాయని, రాష్టం అధోగతి పాలయిందన్నారు. సమావేశంలో ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్రధాన విజయరాం, రాష్ట్ర తెలుకల సాధి కార సమితి సభ్యుడు కొమ్మనాపల్లి వెంకటరామరాజు, బొనిగి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీయే కొలమానంగా సీట్ల కేటాయింపు

అరసవల్లి: నీతి, నిజాయితీలే కొలమానంగా తీసుకుని శ్రీకాకుళం పార్లమెంట్, ఇతర అసెంబ్లీ స్థానాలను అభ్యర్థులను ఎంపిక చేసిన ఘనత ఒక్క జై భారత్ నేషనల్ పార్టీకే చెందుతుందని ఆ పార్టీ అధికార ప్రతినిధి, లీగల్ సెల్ కన్వీనర్ చౌదరి లక్ష్మణరావు, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఇప్పిలి సీతరాజు అన్నారు. బుధవారం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో అభ్యర్థులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, పలాస అభ్యర్థులు రాగోలు నాగశివ, బురిడీ గౌరీశంకర్, చీపురు రవికుమార్, బైపల్లి పరమేశ్వరరావు, గోళ్ల తిరుపతిరావు, బద్రి సీతమ్మ యాదవ్ పాల్గొన్నారు.

ఉపాధినిచ్చే అంశాలకే ప్రాధాన్యం

ఎచ్చెర్ల: పీజీ పాఠ్యాంశాల్లో ఉపాధి నిచ్చే అంశాలకే అత్యంత ప్రాధాన్యం ఇచ్చేలా అడుగులేస్తున్నారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఏకకాలంలో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పద్ధతుల్లో వివిధ వర్సిటీల నుంచి అధ్యాపకులు, విద్యా నిపుణులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఫిలాసఫీ అండ్ రెలిజియస్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్ సబ్జెక్ట్‌లపై ఈ సమావేశం జరిగింది. వర్సిటీలో పీజీ స్థాయిలో బోధిస్తున్న సబ్జెక్టులన్నింటికీ జాతీయ విధానం-2020 ప్రకారం తాజాగా మార్పులు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని మిగిలిన వర్సిటీలకు వివిధ సబ్జెక్టుల బాధ్యత కేటాయించాగా, బీఆర్ఏయూకు ఫిలాసఫీ, జర్నలిజం కోర్సుల్లో పాఠ్యాంశాల మార్పులపై బాధ్యత అప్పగించారు. ప్రస్తుత మార్కెట్, పరిశ్రమలు నూతన విద్యా విధానాలకు అనుగుణంగా పాఠ్యాంశాల్లో సమూల మార్పులు రావాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. వీసీ కేఆర్ రజని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

తగాదాలకు దూరంగా ఉండాలి

జి.సిగడాం: తగాదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వై.మధుసూదనరావు అన్నారు. బుధవారం గ్రామంలో అవగాహన సదస్సును నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని గొడవలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.